క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నాయకుడు



కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: కణేకల్లు మండలం పూలచెర్లకు చెందిన జనసేన నాయకుడు ఈశ్వర్ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి సమక్షంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. మెట్టు గోవిందరెడ్డి సాదరంగా ఆహ్వానించారు. ఈశ్వర్ మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే యువతకు మేలు జరుగుతుందని తెలిసి స్వచ్ఛందంగా పార్టీలో చేరినట్లు తెలిపారు. కూటమి గెలుపునకు జనసేన తరఫున కష్టపడి పనిచేసినా ఎలాంటి గుర్తింపులేదన్నారు.

నేడు 'భూమి రత్న' పురస్కారాలు

బొమ్మనహాళ్: రైతు దినోత్సవ కార్యక్రమంలో ఉత్తమ రైతులకు సోమవారం భూమి రత్న పురస్కారాలు పంపిణీ చేయనున్నట్లు ప్రకృతి వ్యవసాయ కమిటీ రైతు బసవరాజుస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని రజాక్ ఫంక్షన్ హాలులో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ కార్యక్రమం జరుగుతుందన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం బీఆర్ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఎరడికెరలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం అమిత్‌షా చిత్ర పటాలను దహనం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ జేఏసీ మండల అధ్యక్షుడు చంద్ర, జిల్లా నాయకులు తిమ్మప్ప, వన్నూరు స్వామి, చన్నమల్ల దొడగట్ట నరసింహులు, నారాయణ పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు భిక్ష



అయ్యప్ప ఆలయంలో మాలధారులకు భిక్ష ఏర్పాటు చేసిన దృశ్యం

ఉరవకొండ: స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో మాలధారులకు ఆదివారం హోస్పేట్‌కు చెందిన నిర్మల పాలాక్షి భిక్ష ఏర్పాటు చేశారు. అన్నదానం కార్యక్రమం కోసం రూ.10,116 చెల్లించారు. కూరగాయాలు సున్నాబాలాజీ, ఆకుకూరలు లాలుస్వామి, పెరుగు లక్ష్మీమిల్క్‌డెయిరీ వారు అందించారు. కార్యక్రమంలో ఆలయ నిత్య అన్నదాన సేవా సమితి సభ్యులు డీఈఈ మీనుగ వెంకటేసులు ఇతర సభ్యులు పాల్గొన్నారు.


ప్రసన్న వేంకటరమణుడికి తిరుప్పావై సేవ



ధనుర్మాస పూజలందుకున్న సతీసమేత వేంకటరమణస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలోని ప్రసిద్ధిగాంచిన ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలకు భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉదయం తెల్లవారు జామున 5 గంటల నుంచి ధనుర్మాస పూజలు జరిగాయి. స్వామి వారి తిరుప్పావై సేవకు వేకువ జామున భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి, పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు బాల మురళీకృష్ణ ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకం, అభిషేకాలు, కుంకుమార్చన, నైవేద్యం, పుష్పార్చన, ప్రసాద వినియోగం జరిగింది.

గుండె ఆపరేషన్ వికటించి వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



రామదాసు (ఫైల్)

కుందుర్పి: మండలంలోని బెస్తరపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రామదాసు (60) గుండె ఆపరేషన్ వికటించి ఆదివారం మృతి చెందాడు. రామదాసు రెండు రోజుల క్రితం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గుండె ఆపరేషన్ కోసం చేరాడు. గుండె ఆపరేషన్ చేస్తుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 12 ఏళ్లుగా వైఎస్సార్‌సీపీ బలోపేతానికి రామదాసు ఎంతో కృషి చేశారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కూటమి.. ఓటి మాటలేనా?

నిధుల లేమితో ఎక్కడి సమస్యలు అక్కడే

- పైసా కూడా విదల్చని కూటమి సర్కారు
- వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరు చేసిన 37 అభివృద్ధి పనులనూ రద్దు చేసిన ప్రభుత్వం
- పేరుకుపోయిన రూ.కోట్ల విద్యుత్ బకాయి
- అన్నింటికీ సాధారణ నిధులే ఆధారం
- కొత్త ప్రభుత్వంలో కనిపించని సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం



ఈ చిత్రం రాయదుర్గంలోని కొలిమివీధి, రామస్వామి వీధిలోనిది. భారీ వర్షానికి ముంపునకు గురైంది. శాశ్వత సమస్య పరిష్కారానికి వరదనీరు మళ్లింపు, డ్రైనేజీల ఆధునికీకరణకు వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ రూ.20 కోట్లు మంజూరు చేశారు. ప్రతిపాదనలు సైతం టెక్నికల్ శాంక్షన్‌లో ఉన్నాయి. అదే సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో నిధుల మంజూరును కూటమి సర్కారు గాలికొదిలేసింది.

రాయదుర్గంటౌన్: 'దుర్గం' సంక్షేమ, అభివృద్ధిని కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. ఎన్నికల సమయంలో అభివృద్ధికి పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చి నేటికీ పట్టించుకోలేదు. పట్టణంలో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేశాయి. కొత్త ప్రభుత్వంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణమూ చేపట్టలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్కీమ్ నిధులు, సీఎండీఎఫ్, గడపగడపకూ మన ప్రభుత్వం, నాడు-నేడు నిధులతో అభివృద్ధి పనులు చేశారు. రూ.కోట్లలో విద్యుత్ బకాయి పేరుకుపోయింది. రాయదుర్గం మున్సిపాలిటీలో మొత్తం 32 వార్డులు ఉన్నాయి. 75వేల దాకా జనాభా ఉంది. ఆస్తి పన్ను, నీటి పన్ను, ఇతరాత్ర అన్ని రకాల ఆదాయ మార్గాలతో ఏటా దాదాపు రూ.7 కోట్ల దాకా ఆదాయం వస్తుంది. వంద శాతం పన్ను వసూలు కాకపోతే పాలనాపరంగా ఆర్థిక ఇబ్బందులు తప్పవు. ఈ కారణంగా ఆదాయానికి మించి వ్యయం అవుతుండడంతో అభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రతి పనికీ సాధారణ నిధులపైనే ఆధారపడాల్సి వస్తోంది. మరోవైపు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాయదుర్గంలోని 18 సచివాలయాల పరిధిలో డీబీటీ ద్వారా రూ.225 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.144 కోట్లతో అభివృద్ధి పరుగులు పెట్టింది. ప్రస్తుతం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పైసా విదల్చని పరిస్థితి.

రూ.20 కోట్ల నిధులకు గ్రహణం

రాయదుర్గంలో ముంపు సమస్య పరిష్కరించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువతో మున్సిపాలిటీకి రూ.20 కోట్లు మంజూరు చేశారు. అదే సమయంలో ఎన్నికలు రావడం.. ఆతర్వాత ప్రభుత్వం మారడంతో నిధులు మంజూరు విషయాన్ని కూటమి సర్కారు చెత్తబుట్ట పాలు చేసింది.

సగ భాగం ఔట్ సోర్సింగ్ జీతాలకే..

పురపాలక సంఘంలోని పారిశుధ్యం, ఇంజినీరింగ్, పరిపాలన విభాగాలతోపాటు ఇతర విభాగాల్లో 143 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పని చేస్తున్నారు. వీరికి నెలకు రూ.30 లక్షల మేర ఏడాదికి రూ.3.60 కోట్లు వేతనాల రూపంలో చెల్లించాలి. దీంతోపాటు ముఖ్యమైన వీధి దీపాలు నిర్వహణకు నెలకు రూ.6 లక్షల చొప్పున ఏడాదికి రూ.72 లక్షల బిల్లు చెల్లిస్తున్నారు. అంటే పన్నుల ద్వారా వచ్చే సాధారణ నిధుల్లో 70 శాతం నిధులు ఏడాదికి రూ.4.32 కోట్లకుపైగా కేవలం జీత భత్యాలు, వీధి దీపాల బిల్లులకే సరిపోతుంది. మిగతా నిధులు మెయింటెన్స్, డీజల్, పారిశుధ్య నిర్వహణ, తాగు నీటి మోటార్లు, లీకేజీల మరమ్మతులకే అరకొరగానే వెచ్చించాల్సి వస్తోంది. మరోవైపు రూ.54 కోట్ల అమృత్-2 పనుల కోసం రూ.4 కోట్ల షేర్ మున్సిపాలిటీ నుంచి కట్టాల్సి వస్తుండడంతో నిధుల కొరత తీవ్ర స్థాయికి చేరుకుంది.



గాంధీస్కూల్ సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణానికి నోచుకోక కంకర తేలిన దృశ్యం



32వ వార్డులో అభివృద్ధిని ప్రశ్నిస్తున్న డ్రైనేజీ దుస్థితి



14వ వార్డు డ్రైవర్స్‌కాలనీలో డ్రైనేజీ లేక రోడ్లపై మురుగు ఇలా..

పేరుకుపోయిన హెచ్‌టీ లైన్ బిల్లు..

మున్సిపాలిటీకి హెచ్చెల్సీ తాగునీటి పథకం నిర్వహణకు సంబంధించి హెచ్‌టీ లైన్ బిల్లు చెల్లింపు గుదిబండగా మారుతోంది. నెలకు దాదాపు రూ.45 నుంచి రూ.50 లక్షల బిల్లు వస్తుంది. ఏడాదికి రూ.6 కోట్ల దాకా కేవలం హెచ్‌టీ బిల్లు చెల్లించాల్సి ఉంది. ఈ బిల్లు చెల్లించాలంటే కేవలం స్కీమ్ నిధులపైనే ఆధారపడ్డారు. 15వ ఆర్థిక సంఘం కింద మంజూరయ్యే నిధుల్లోనే కొద్దిమేర కరెంటు బిల్లుకు చెల్లించాల్సి వస్తోంది.

37 అభివృద్ధి పనులు రద్దు..

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, నీటి వసతి కోసం బోరుబావుల తవ్వకం, పాఠశాలల అభివృద్ధి, ఆస్పత్రుల నిర్మాణంతోపాటు ఇతర అభివృద్ధి పనులు విరివిగా చేపట్టారు. వీటిలోనే మున్సిపాలిటీలో వర్క్ ఆర్డర్లు ఇచ్చి ప్రారంభంకానివి, 25 శాతం లోపు జరిగిన దాదాపు 37 అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం అర్ధంతరంగా రద్దు చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



కనీస వసతులు లేవు

శివారు ప్రాంతంలో ఉన్న గౌడ ఇందిరమ్మ కాలనీలో వసతులు కల్పించలేదు. కాలనీలో రెండు, మూడు నెలల నుంచి వీధిలైట్లు వెలగడంలేదు. కనీసం ఎవరూ పట్టించుకోలేదు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేవు. వర్షాకాలంలో మట్టి రోడ్లు అధ్వానంగా మారాయి.

– చాకలి శివ, గౌడ ఇందిరమ్మ కాలనీ, రాయదుర్గం



నిధుల కొరత ఉంది

సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు నిధుల కొరత ఉంది. అత్యవసర పనులకు సాధారణ నిధులపైనే ఆధార పడాల్సి వస్తోంది. వంద శాతం పన్ను వసూలు చేసేందుకు కృషి చేస్తున్నాం. తాగునీటి పథకం నిర్వహణకు కరెంటు బిల్లుల చెల్లింపు భారంగా ఉంది. ఇటీవల సీఎం చంద్రబాబు పర్యటనలో పట్టణాభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ నిధుల కోసం సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలో మంజూరుకానున్న 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు చేపడుతాం.

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

పౌష్టికాహారంతో అయోడిన్ లోపాన్ని అరికట్టొచ్చు



కదదరకుంటలో అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

కూడేరు: పోషకాలతో కూడిన పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా అయోడిన్ లోపాన్ని అరికట్టొచ్చని ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ (ఐజీడీ) జిల్లా కోఆర్డినేటర్ దరగయ్య తెలిపారు. ఆదివారం కూడేరు, కదదరకుంట గ్రామాల్లో ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్మార్ట్ ఆశీర్వాద ప్రాజెక్ట్ సహకారంతో అయోడిన్ లోపంతో కలిగే ఇబ్బందులపై కళాజాతా నిర్వహించారు. కోఆర్డినేటర్ దరగయ్య మాట్లాడుతూ సి-విటమిన్ ఎక్కువగా ఉన్న పండ్లు, చేపలు, పాలు, పెరుగు, బచ్చలకూర తీసుకోవడం ద్వారా అయోడిన్ లోపించదన్నారు. అయోడిన్ లోపిస్తే తలెత్తే ఆరోగ్య సమస్యలను పాటల రూపంలో పేస్ కళాజాతా బృందం తెలియజేసింది. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, ఐజీడీ అధికారులు సుదర్శన్ రెడ్డి, మహమ్మద్, రహీన, పోతులయ్య, రమణమ్మ, ప్రముఖ కళాకారుడు తరిమెల రాజు, ఏఎన్ఎం సుశీల, అంగవాడీ కార్యకర్త ఆశాబీ పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ సాధారణ, బడ్జెట్ సమావేశాలు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘం 2025–26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రత్యేక సమావేశం, సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 24న చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన జరగనుంది. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.36.30 కోట్ల అంచనాతో రూపొందించిన బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదం కోసం ప్రవేశపెట్టనున్నారు. వివిధ ఆదాయ వ్యయాలతో పోలిస్తే ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.98.44 లక్షల మిగులు బడ్జెట్ ఉంటుందని అధికారులు చెప్పారు. మంగళవారం ఉదయం తొలుత 11 గంటలకు బడ్జెట్ సమావేశం నిర్వహించి, తర్వాత మధ్యాహ్నం 12.30 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రవిబాబు

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని డీఎస్పీ రవిబాబు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌డీటీ ఎకాలజీ సెంటర్‌లోని బ్రహ్మసముద్రం, రాయదుర్గం, కంబదూరు, శెట్టూరు, మండలాలకు చెందిన 10వ తరగతికి చెందిన విద్యార్థులు హాజరయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధిస్తే ఉన్నత చదువులకు మార్గం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులు తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు శ్రద్ధగా విని క్రమశిక్షణతో మెలగాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమాధికారి దామోదర్, ఎంఈఓలు శ్రీధర్, ఓబుళపతి, ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మన్న, వినియోగదారుల సంఘం అధ్యక్షుడు చల్లా కిశోర్ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ సమీపంలో ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలయ్యాయి. తాడిపత్రి నుంచి బ్రహ్మసముద్రం మండలానికి ఆదివారం ఎనిమిది మంది ప్రయాణికులతో ఆటో బయల్దేరింది. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామం వద్దకు ఆటో రాగానే, వెనుక వైపు నుంచి బొలెరో వాహనం ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. దీంతో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న దస్తగిరమ్మ, సూర్జహాన్, హెబ్బావలి, కుళ్లాయప్ప, వన్నూర్‌బీ, ఖాసీం, అబ్దుల్ స్వల్పంగా గాయపడ్డారు. రోడ్డు పక్కనున్న ఒంటిమిద్దికి చెందిన చంద్రకు కాలు విరిగింది. ఓబులేసు స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడిన వారిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ పోలీసుల కేసు దర్యాప్తు చేపట్టారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్ర గాయాలు.

కళ్యాణదుర్గం సమీపంలోని ముదిగల్లు రోడ్డులోని చర్చి సమీపంలో బైక్ అదుపుతప్పి యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లుకు చెందిన నరసింహులు బేల్దారి పనులు చేసుకుంటూ పావగడలో జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ముదిగల్లుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, చర్చి సమీపంలోకి రాగానే అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నరసింహులును స్థానికులు సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాణిజ్య విభాగం అధ్యక్షుడికి సన్మానం



వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు రేవణ్ణను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని తన నివాసంలో వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కురుబ రేవణ్ణను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం సన్మానించారు. రేవణ్ణ మాట్లాడుతూ తనను గౌరవించి వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమించిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డికి, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్యకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మన్న, పరమేశ్వరప్ప, నాయకులు బిక్కి హరి, ఉమాపతి, పాత లింగ, మల్లాపురం మల్లి, దేవపుత్ర, మోహన్‌రెడ్డి, వెంకటేశులు, నాగరాజు, టైలర్ శీన, సూరి పాల్గొన్నారు.

శుభకార్యం



వధూవరులను ఆశీర్వదిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత ఉమా

కంబదూరు: మండలంలోని కొత్తమిద్దెలో ఆదివారం జరిగిన వైఎస్సార్‌సీపీనాయకుడు వడ్డే గోవిందు కుమార్తె శిరీష, అభిషేక్ వివాహ వేడుకలో పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు పాల్గొన్నారు. అలాగే చెర్లోపల్లిలో జరిగిన శంకర్ వివాహ వేడుకలోనూ పాల్గొన్నారు. కంబదూరు మండలం వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ నాయకుడు రవికుమార్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నేత బాబురెడ్డి, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, జిల్లా నాయకులు గోవింద్, రేవన్న, హనుమంతరాయుడు, యువజన నాయకుడు బీమేష్, నాయకులు తిమ్మరాయుడు, లోకనాథ్‌రెడ్డి, పరంధామరెడ్డి, పాతలింగ, రాఘవేంద్ర, సర్పంచులు హరినాథ్, రాజగోపాల్, బాపూజీ, శివ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి



మాట్లాడుతున్న అర్బన్ సీఐ జయనాయక్

రాయదుర్గం: రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని అర్బన్ సీఐ జయనాయక్ సూచించారు. ఆదివారం స్థానిక పీఎస్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు రోడ్డు భద్రతా చర్యలు చేపట్టామన్నారు. వాహనాల్లో ప్రయాణించేటప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవడం, హెల్మెట్ ధరించటం తప్పనిసరి చేశామన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు చేపడతామన్నారు. ఈ దిశగా పట్టణంలోని అన్ని దారుల్లోనూ వాహన దారులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తూ, హెల్మెట్ లేని కొందరికి ఉచితంగా అందించామన్నారు. పోలీసులకు భయపడో లేక ఫైన్లు విధిస్తారనే ఆలోచనతో కాసేపు ధరించి, ఆతర్వాత వాహనాలకు తగిలించే పద్ధతి మానుకోవాలన్నారు. తలపై శిరస్త్రాణం ఉంటే ప్రయాణం చేసినంతసేపు ప్రాణం సురక్షితంగా ఉంటుందన్నారు. త్రిబుల్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి, వాహనాలు నడిపేవారిపై ఉక్కుపాదం మోపామన్నారు. చిన్నపిల్లలకు వాహనాలిచ్చి రోడ్డుపైకి పంపితే సీజ్‌చేసి కేసులు నమోదుచేస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ దృష్ట్యా ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందన్నారు.

అనాథలకు దుస్తుల పంపిణీ



అన్నదానం చేస్తున్న సీఐ మహానంది, మాలమహానాడు నాయకులు

ఉరవకొండ: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలకబాల రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధ అనాథాశ్రమంలో దుస్తులు పంపిణీ చేసి, అన్నదానం చేశారు. అర్బన్ సీఐ మహానంది పవిత్ర క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మాలమహానాడు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు, నాయకులు ఓబయ్య, ఎల్లప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో చాబాల విద్యార్థి ప్రతిభ



జి.శశికిరణ్

వజ్రకరూరు: మండలంలోని చాబాలకు చెందిన జి.శశికిరణ్ ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన అబాకస్, వేదిక్ మ్యాథ్స్ జోనల్ లెవెల్(2024–25) పోటీల్లో ప్రతిభ కనబరచి జిల్లా స్థాయిలో మూడో స్థానంలో నిలిచాడు. చాబాలకు చెందిన జి.శశికిరణ్ ఉరవకొండ పట్టణంలోని జ్యోతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నవత ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో అబాకస్ వేదిక్ మ్యాథ్స్ జోనల్ లెవెల్ పోటీలు నిర్వహించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా



వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జల్లిపల్లి దేవేంద్ర

కూడేరు: జిల్లా వ్యాప్తంగా పర్యటించి బీసీలను ఏకం చేసి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జల్లిపల్లికి చెందిన కురుబ దేవేంద్ర తెలిపారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తనకు బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చిన అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని, పార్టీ నేతలకు, కార్యకర్తలకు అండగా నిలిచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

దశభుజ మహా గణపతికి పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామి వారికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి వారి దర్శనానికి స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

నీలగిరిస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో నీలగిరిస్వామి

వజ్రకరూరు: స్థానిక కురుబవీధిలో నీలగిరిస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు ఆకుపూజ, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, విశేష పూజలు నిర్వహించారు.

డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడికి సన్మానం



డాక్టర్ బొమ్మయ్య, దాదులను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంబదూరు: వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు, మైనార్టీ విభాగం తాలూకా అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ బొమ్మయ్య, దాదులను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం సన్మానించారు. మండల కేంద్రంలోని డాక్టర్ బొమ్మయ్య నివాసంలో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, మండల కన్వీనర్ బాలరాజు, జిల్లా నాయకులు కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, నీలి శంకరప్ప, యువజన నాయకుడు బీమేష్, ఎంపీటీసీ మీసేవ కుమార్, కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, వార్డు మెంబర్ రాజు, నాయకులు నాగార్జున, ఖాజా, ముత్యాలు, మధు పాల్గొన్నారు.



సీఎస్ఐ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



టీచర్ సుధీర్ బాషా (ఫైల్)

కణేకల్లు: మండలంలోని మాల్యం ఎస్‌డబ్ల్యూ స్కూల్ టీచర్ సుధీర్ బాషా (49) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. వజ్రకరూరు మండలం గంజికుంటకు చెందిన బాషా.. సొంతూరు నుంచి విధులకు వెళ్లేవారు. శనివారం విధులు ముగించుకొని ఇంటికెళ్లిన ఆయన.. కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. రాత్రి 9:30 గంటల సమయంలో ఛాతీలో నొప్పి రావడంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఎంఈఓలు లక్ష్మన్న, భవానీశంకర్, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఫయాజుద్దీన్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఏపీటీఎఫ్ మండలశాఖ అధ్యక్షులు అస్లాంబాషా, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు శివారెడ్డి, వెంకటేశులు, రామ్మోహన్‌గౌడ్ తదితరులు గంజికుంటకెళ్లి బాషా మృతదేహానికి నివాళులర్పించారు.

సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకలు

ఉరవకొండ: స్థానిక సీఎస్ఐ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఫాస్టర్ ప్రమీలా జోసఫ్ ఆధ్వర్యంలో క్రైస్తవులు క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం ఫాస్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరినీ సన్మార్గంలో నడిపించడమే క్రిస్మస్ ఉద్దేశమన్నారు.

పెనుకొండ బాబా ఫక్రుద్దీన్ జెండా ఊరేగింపు



బాబా ఫక్రుద్దీన్ జెండా ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక పాతబజారు వద్ద వెలసిన పెనగొండ బాబా జెండా కట్ట వద్ద ఫక్రుద్దీన్ ఉరుసును పురస్కరించుకొని ఆదివారం జెండా ఊరేగింపు వైభవంగా జరిగింది. సయ్యద్ అజ్మతుల్లా హుసేని వారి ఆశీస్సులతో జెండా కట్ట వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం విశేష పుష్పాలతో అలంకరించిన జెండాను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. వందలాది మందిక అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు జెండా ఫక్రుద్దీన్, జెండా సలాం తదితరులు పాల్గొన్నారు.